క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, సిరికల్చరల్, ఉద్యాన , పశు సంవర్ధకశాఖ, విద్యుత్, రెవెన్యూ, పౌరసరఫరాలు, తాగునీరు, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, ఉపాధి హామీ, వాటర్ షెడ్, గృహ నిర్మాణం, విద్య, సాంఘిక సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం , సచివాలయ, ఆర్‌బికే, రవాణాశాఖ తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల శాఖ అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

కలెక్టర్‌కు సత్కారం

బి.కొత్తకోట: మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీలోని ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలనకు సోమవారం వచ్చిన కలెక్టర్ గిరీషాను శీలంవారిపల్లె పంచాయతీ సర్పంచు భీమిగాని నాగిరెడ్డి, స్థానికులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. తమ ప్రాంతానికి తొలిసారి కలెక్టర్‌ను సత్కరించామని వారు తెలిపారు.

ఎమ్మెల్యే నివాళి

వాల్మీకిపురం: మండలంలోని నగిరిమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారే తిమ్మారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం మృతుడి స్వగృహానికి చేరుకొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నపిల్లల డాక్టర్‌గా విక్రాంత్‌రెడ్డి



తంబళ్లపల్లె: స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల డాక్టర్‌గా విక్రాంత్ రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వైద్యవిద్య పూర్తి చేసి మొదటిసారిగా ప్రత్యేక చిన్నపిల్లల డాక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. సకాలంలో అందుబాటులో ఉండి చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య చికిత్సలపై అవగాహ కల్పించి సకాలంలో వైద్య చికిత్సలు అందిస్తానన్నారు.

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా శశి

బి.కొత్తకోట: నియోజకవర్గం కాపునాడు అధ్యక్షుడిగా బి.కొత్తకోటకు చెందిన దేసుగారి శశి భూషణ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రమణ్యం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం శశి భూషణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బలిజల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

పంటల సాగుపై ఉన్నతాధికారులకు నివేదిక

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఉన్నతాధికారులకు పంపామని ఏఓ ప్రేమలత అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 7,515 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవనందున కేవలం 1,700 హెక్టార్లలో మాత్రమే సాగు చేసారన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి జిల్లా ఉన్నతాధికారులకు సమగ్రంగా నివేదిక పంపించామని ఏఓ తెలిపారు.

కొలువుదీరిన పీర్లు



పీలేరు మోడల్ కాలనీలో కొలువుదీరిన పీర్లు

పీలేరు : మొహర్రం ఉత్సవాలు పురస్కరించుకుని స్థానిక మోడల్ కాలనీలో సోమవారం పీర్లను కొలువు దీర్చారు. పీర్లకు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలువురు హిందూ, ముస్లింలు పాల్గొని చక్కెర చదివింపులు చదివించారు. వారం రోజుల పాటు పీర్లను గ్రామంలో ఊరేగింపు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి

పెద్దతిప్పసముద్రం: మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర నాయకుడు కేవీ రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటన అత్యంత హేయమైన చర్య అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ముగ్గురు ఆడవారిని వివస్త్రను చేసి నడి రోడ్డుపై ఊరేగించి, గ్యాంగ్ రేప్ చేసిన నిందితులకు బీజేపీ, కేంద్రంలోని పెద్దల సహకారం ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల అండతోనే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు.

రూ. 28 కోట్లతో అభివృద్ధి పనులు

- రూ.56 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమి పూజ
- గడప గడపలో గుర్తించిన సమస్యలకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యే నవాజ్ బాషా



మాట్లాడుతున్న ఎంఎల్ఏ నవాజ్‌బాషా

మదనపల్లె : మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.28 కోట్లు నిధులు వినియోగిస్తున్నామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం 30వ వార్డు ప్రశాంత్‌నగర్ సాగర్ అపార్ట్‌మెంట్స్ వీధిలో రూ.56 లక్షల రూపాయలతో నిర్మించనున్న మురుగునీటి కాలువ నిర్మాణానికి మునిసిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్ సరితతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 35 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆయా ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించామన్నారు. సమస్యల పరిష్కారానికి ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.28 కోట్లు ఖర్చు చేసేందుకు తీర్మాణం చేశామన్నారు. అందులో భాగంగా మురుగునీటి కాలువ నిర్మాణం, సాగునీటి సమస్యల పరిష్కారినికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం గడప గడపలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా నిధులు మంజూరు చేస్తోందన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ వార్డు ప్రజలు గడప గడపలో భాగంగా మురుగునీటి కాలువల కోసం విన్నవించారన్నారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మురుగునీటి కాలువ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శిరీష, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు శ్రీనివాసులు, వసీం, రేణుక, మార్కెట్ యార్డు డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, నాయకులు బాలగంగాధర్‌రెడ్డి, రఫీ, ఇర్ఫాన్‌ఖాన్‌తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలను అందించండి

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా వైద్యులకు సూచించారు. సోమవారం ప్రభుత్వ జిల్లా ఆసుప్రతిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుప్రతిలోని ఓపి విభాగం, క్యాజువాల్టీ, ఐసీయూ, అత్యవసర ఓపీ, ఎక్స్‌రే, ఆప్తమాలజీ, ఎస్‌ఎన్‌సీయూ విభాగాలను పరిశీలించారు. ఆసుప్రతిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సూపరింటెండెంట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుప్రతి నుంచి అధిక సంఖ్యలో అత్యవసర, ఆప్తమాలజీ విభాగాల నుంచి అధిక శాతం కేసులు రెఫర్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్ని సౌకర్యాలు ఆసుప్రతిలో ఉన్నా కేసులు ఎందుకు రెఫర్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఆసుప్రతిలో సిబ్బంది కొరతకు సంబంధించిన వివరాలను ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ పాల్‌రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇక్కడే నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మరోసారి ఆసుప్రతి వైద్య సేవల పై ఆరోపణలు వస్తే సహించబోనని హెచ్చరించారు. ప్రైవేట్ ప్రాక్టీసు నిర్వహించే వైద్యులు చిత్తశుద్ధితో పని చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ ప్రసాద్‌రాజు, నర్సింగ్ సూపరిండెంట్ నాగశ్రీ, వైద్యులు పాల్గొన్నారు.

సేవకు సలాం



అంకిత భావంతో సేవలు



బెంగళూరులో కిడ్నీ పేషెంట్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ షఫీ (ఫైల్)

కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్న ఓ మహిళకు మండలానికి చెందిన వలంటీర్ షఫీ ప్రతినెలా ఠంచనుగా 1వతేదీన అక్కడకు వెళ్లి పెన్షన్ అందించి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నాడు. నిమ్మనపల్లె మండలంలోని అగ్రహారం పంచాయతీ మంచి గుంటపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య వసంత కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ఆమెకు డయాలసిస్ పెన్షన్ కింద ప్రతినెలా రూ.10వేలు అందజేస్తోంది. కొంతకాలంగా ఆమెకు వ్యాధి తీవ్రత పెరగడంతో బెంగళూరులోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ అక్కడే ఉంటోంది. నెలరోజుల క్రితం శస్త్రచికిత్స నిర్వహించారు. వైద్యసేవల నిమిత్తం ఆమె ఇప్పటికీ అక్కడే ఉంటోంది. దీంతో పెన్షన్ తీసుకునేందుకు ఆమె గ్రామంలో అందుబాటులో లేకుండా పోయింది. దీంతో వలంటీర్ షఫీ ఆరునెలలుగా సొంతఖర్చులతో 170 కిలోమీటర్లకు పైగా బెంగళూరుకు ప్రయాణించి బాధితురాలికి పెన్షన్ అందించి వస్తున్నాడు. అలాగే తన పరిధిలోని 50 కుటుంబాలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నాడు.

– నిమ్మనపల్లె



వలంటీర్ సేవలు మరువలేనివి....

అనారోగ్యంతో బాధపడుతూ, ఊరికి దూరంగా ఉన్నప్పటికీ ప్రతినెలా క్రమం తప్పకుండా పెన్షన్ అందించాలన్న సేవాగుణంతో బెంగళూరుకు వచ్చి డబ్బులు ఇచ్చి వెళుతున్న వలంటీర్ షఫీ సేవలు మరువలేనివి. మా బాగోగులు కనిపెట్టుకునేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– వసంత, డయాలసిస్ పెన్షన్ లబ్ధిదారు, నిమ్మనపల్లె

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

– ఆర్డీఓ మురళి



ఆర్డీఓకు వినతిప్రతం అందజేస్తున్న అర్జీదారులు

మదనపల్లె : జగనన్నకు చెబుదాం స్పందనలో వచ్చే వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని ఆర్డీఓ మురళి అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీదారుల నుంచి వినతిప్రతాలు స్వీకరించారు. ఈ సందర్భంగా 45 మంది బాధితులు వినతులు అందజేశారు. కురబలకోట మండల పరిధిలోని 12 ఎకరాల భూములకు సంబంధించి క్రయవిక్రయాలతో పాటు అనుభవదారులుగా ఉన్న బాధితులకు 1.41 ఎకరాలకు సంబంధించి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పరిహార విషయమై ఫిర్యాదు చేశారు. కోళ్లబైలు జగన్‌కాలనీలో రోడ్లు, మురుగునీటి కాలువల సమస్య పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని అయినా న్యాయం జరగలేదని సంబంధిత కాలనీ వాసులు ఆర్డీఓకు విన్నవించారు. సురభి కాలనీలో కాలువ పై కల్వర్టు నిర్మించాలని కాలనీవాసులు వినతిప్రతం అందజేశారు. సంబంధిత సమస్యలపై ఆర్డీఓ పరిష్కారానికై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు

కనుల పండువగా ఏకరుద్రాభిషేకం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత వరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివ లింగానికి ఏకరుద్రాభిషేకం కార్యక్రమాన్ని కనుల పండవగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలోని విగ్రహ ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శాంతి హోమం, నవగ్రహ హోమం, కలశ స్థాపన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

దాడులు అరికట్టాలని నిరసన



సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె : దేశం, రాష్ట్రంలో బహుజనులు, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, బహుజనులపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత 40 రోజులుగా మణిపూర్‌లో వివక్ష దాడులు జరుగుతున్నా ప్రధాన మంత్రి స్పందించక పోవడం శోచనీయమన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

తంబళ్లపల్లె: మండలంలోని వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు మండల సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఏపీఎంలు గంగాధర్, రాజన్న కోరారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో ఎంఎస్ అధ్యక్షురాలు కుమారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో జరిగింది. మహిళా సంఘాలు, వీవోల నిర్వహణ,బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల పంపిణీ, తిరిగి చెల్లింపులు, పొదుపులు తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. అర్హత కలిగిన ప్రతి మహిళా సంఘానికి బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల పంపిణీ, బ్యాంకుకు తిరిగి చెల్లింపులు, సంఘాల పటిష్టత అంశాలపై తీర్మానం చేసి కమిటీ సభ్యులు ఏకగ్రీంగా ఆమోదించారు. మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు నాగరత్నమ్మ, కార్యదర్శి నౌజియా, ఉప కార్యదర్శి లలిత, కోశాధికారి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గోపాల క్రిష్ణ



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కె.గోపాల క్రిష్ణ

కలికిరి: బీఎల్‌ఓలు ఓటరు వెరిఫికేషన్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.గోపాల క్రిష్ణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని, ఇల్లు ఖాళీ చేసిన వారి వివరాలను చుట్టుపక్కల నివాసాల వారిని విచారించిన తరువాతనే మార్పులు, చేర్పులు చేయాలన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గి ఓట్లు చేర్పులు, తొలగింపులు చేయకూడదని, పూర్తి విచారణ అనంతరమే తొలగింపులు, చేర్పులకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు కూడా బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలత, డీటీ సయ్యద్ అహ్మద్, ఆర్ఐ చాణుక్య, ఏఎస్ఐ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఫొటో,వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ

మదనపల్లె సిటీ: మదనపల్లె ఫొటో,వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా భరత్‌కుమార్, కార్యదర్శిగా అవినాష్, జాయింట్ సెక్రటరీలుగా శివకుమార్, విశ్వనాథ్, ట్రెజరర్‌గా తేజతో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

రికార్డు అసిస్టెంట్ మృతిపై కేసు



మృతి చెందిన గోపినాథ్

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న గోపినాథ్(55) మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరుకు చెందిన ఆయన గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. స్థానిక సుధీర్ వీధిలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఈ నెల 14 వరకు విధులకు హాజరయ్యాడు. గత రెండు రోజులుగా ఇంట్లో నుంచి అతడు బయటకు రాలేదు. అనుమానం కలిగిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు ఉద్యోగి నివాసముంటున్న ఇంటి వద్దకు చేరుకొని తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లారు. ఇంట్లో గోపినాథ్ అప్పటికే మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మదనపల్లె : రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కన్వీనర్ విశ్వనాథ్, ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్నవెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో అనేక భూవివాదాలు ఉన్నాయని, వన్‌బి, అడంగల్, పాసుపుస్తకాలు తదితర సమస్యలకు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్ని సార్లు అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలకు పరిష్కారం లభించలేదని వాపోయారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ మురళికి వినతిపత్రం అందజేశారు.

ఆత్మగౌరవ దీక్షను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కుమ్మర యువసేన నాయకులు

గుర్రంకొండ: ఈనెల 27న విజయవాడలో తలపెట్టిన కుమ్మర ఆత్మగౌరవ దీక్షను విజయవంతం చేయాలని ఏపీ కుమ్మర యువసేన ఉపాధ్యక్షుడు సురేంద్ర కోరారు. సోమవారం గుర్రంకొండలొ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆత్మగౌరవ దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవ దీక్షకు కుమ్మర సోదరులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. దీక్షలో కుమ్మరసోదరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కుమ్మర యువసేన నాయకులు రామాంజులు, నవీన్, భూపేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం బాలంవారిపల్లె పంచాయతీలో సదుం హరిజనవాడ, గుర్రంవాండ్లపల్లె, దేశిరెడ్డిగారిపల్లె, నూనెవాండ్లపల్లె, ఒంటేరువాండ్లపల్లె, మొరవపల్లె, నాలేవాండ్లపల్లె కాలనీలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలు చదివి వినిపించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. దేశిరెడ్డిగారిపల్లెలో విద్యుత్ వీధి దీపాలు, రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలు కావాలని కోరడంతో అప్పటికప్పుడే ఏర్పాటు చేపించారు. గుర్రంవాండ్లపల్లెలో మురుగునీటికాలువలు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము నిరంతర ప్రజలతో ఉంటామని, ఏ సమస్య ఉన్నా పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం తోపాటు ఎన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికి ఏదో విధంగా ఆర్థికంగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. తమ ప్రభుత్వంలో కులమత, వర్గ భేదాలు లేకుండా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకుండా ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చునని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, వైస్ ఎంపీపీ చలపతి, సర్పంచ్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, ఎంపీటీసీ దామోదర్, నాయకులు బి.డి. నారాయణరెడ్డి, శివగణేష్‌సురేంద్ర, గంగిరెడ్డి, మురళి, ఆనంద్, రఘునాథరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హుమయూన్, చిన్నయల్లప్ప, రామ్మోహన్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా



నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో అదుపులోకి తీసుకున్న నిందితులకు సోమవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన నిందితులపై రౌడీషీట్లు తెరవనున్నట్లు చెప్పారు. మత్తుపదార్థాలను సేవిస్తూ యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. గంజాయి రవాణాపై వివరాలు సేకరించామన్నారు. ఇందులో పాల్గొంటున్న వారి పై నిఘా అధికం చేశామన్నారు. పట్టణంలోని జగన్‌కాలనీ, చంద్రాకాలనీ, బాబూకాలనీ, మంజునాథకాలనీ, బయారెడ్డికాలనీ, రంగారెడ్డికాలనీ, కొత్తిండ్లు, ఈశ్వరమ్మకాలనీ, నక్కలదిన్నె, సురభికాలనీ, చుక్కల తాండా, బసినికొండ, రామారావుకాలనీ, బాలాజీ నగర్, దేవతానగర్‌తో పాటు కురబలకోట మండలంలోని నందిరెడ్డికాలనీ తదితర ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. దీని పై దర్యాప్తుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీఐలు సత్యనారాయణ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కలికిరి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్(ఏసీ)రూతు అన్నారు. పట్టణంలో ఎస్.ఎస్.కళ్యాణ మండపంలో మండల సమాఖ్య పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో మండల సమాఖ్యకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.8.72లక్షలు ఆదాయం సమకూరినట్లు, రూ.2.5కోట్లు మహిళా సంఘాలకు అప్పులుగా రొటేషన్‌లు ఉన్నట్లు నివేదిక చదివి వినిపించారు. మహిళలు రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకుని ఆర్థిక వృద్ధి సాధించాలని ఏరియా కో–ఆర్డినేటర్ కోరారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎం సుజాత, సీసీలు ఏకాంబరం, ప్రభాకర, చంద్రకళ, ఆంజనేయులు, ఎంఎస్ అకౌంటెంట్ అనిత పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

పీలేరు రూరల్: పట్టణంలోని స్థానిక రోజా ప్లాట్‌లో గత కొంత కాలంగా నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను జి.వి రాకేష్‌రెడ్డి పరిష్కరించారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌రెడ్డి సోమవారం సాయంకాలంలో ఆ ప్రాంతంలో కొత్త విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లో ఓల్టేజి సమస్యను పరిష్కరింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్ బాషా, ఎంపీటీసీ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు మల్లికార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌నరేషరెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ కొండకు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండకిట్ట ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మగుట్టలోని అమ్మవారిని పూజారి శేఖర్ అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలతో దర్శనం కల్పించారు.